ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- ❖ సార్వత్రికల ఎన్నికలకు సంబంధించి పలు ప్రధాన అంశాలపై వివిధ రాష్ట్రాల సిఎస్ లతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సమావేశం నిర్వహించారు.
- ❖ దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ ఫైనల్ పరీక్షలు రేపు ప్రారంభం కానున్నాయి.
- ❖ హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా మధ్య వారాంతపు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.
- ❖ రానున్న రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, ఎన్నికల వ్యయ నిర్వహణ సెన్సిటివిటి, నోడల్ అధికారుల నియామకం, అంతర్జాతీయ సరిహద్దు వంటి పలు అంశాలపై ఈరోజు ఢిల్లీ నుండి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల సిఎస్, డిజిపి, సిఇఒ తదితర అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, డిజిపి కె.వి.రాజేంద్రనాధ్ రెడ్డి, సిఈఓ ముకేష్ కుమార్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్త, ఇతర అధికారులు పాల్గొన్నారు.

==============================

దేశంలో జేఈఈ మెయిన్ ఫైనల్ పరీక్షలు రేపు ప్రారంభం కానున్నాయి. పరీక్ష నిర్వహణకు జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్టీఏ) ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా 291 నగరాలలో 544 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు సుమారు 12 లక్షల మంది హాజరుకానున్నారు. కాగా తెలుగు రాష్ట్రాల నుంచి 50

వేల మంది ఈ పరీక్ష రాయనున్నారు. బీఈ, బీటెక్ పరీక్షలను సాధారణ విద్యార్థులకు 3 గంటలు, వికలాంగ అభ్యర్థులకు 4 గంటల పాటు నిర్వహిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా మధ్య వారాంతపు ప్రత్యేక ఏ.సి. రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 4, 11వ తేదీల్లో హౌరాలో మధ్యాహ్నం 12 గంటల 40 నిమిషాలకు బయల్దేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 2 గంటల 43 నిమిషాలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 2 గంటల 45 నిమిషాలకు బయలు దేరుతుంది. మరుసటి రోజు రాత్రి 12 గంటల 15 నిమిషాలకు యశ్వంత్‌పూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ వీక్లీ స్పెషల్ రైలు 6, 13వ తేదీల్లో యశ్వంత్‌పూర్‌లో తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11. గంటలకు 05 నిమిషాలకు దువ్వాడ చేరుకుని, మరసటిరోజు మధ్యాహ్నం ఒంటి గంటా 25 నిమిషాలకు హౌరా చేరుకుంటుందని వెల్లడించారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణీకులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మెరుగైన సమాజం, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటే పునాదని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. పాడేరులోని గురుకులం కళాశాలలో ఈరోజు క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని పటిష్టమైన ప్రజా స్వామ్యానికి పునాది వేయాలని పేర్కొన్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమం నిర్వహించి మారుమూల ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని చెప్పారు. ప్రలోభాలకు లోను కాకుండా కులం, మతాలను చూడకుండా విజ్ఞతతో ఓటు వేయాలని స్పష్టం చేసారు. ఈనెల 14వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతోందని, ఎవరైన ఓటు నమోదు చేసుకోలేకపోతే నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రెండు రోజుల క్రితం విశాఖ తీరం నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలతో సురక్షితంగా బయడపడ్డారు. చేపల వేట ముగించుకుని తిరిగివస్తోన్న సమయంలో గాలితీవ్రతకు బోటు బోల్తాపడింది. అదే బోటుపై తమ వద్ద వున్న ఫ్లెక్సీని తెరచాపలా ఉపయోగించి అప్పికొండ సముద్ర తీరానికి చేరుకున్న వీరిని స్థానిక మత్స్యకారులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. వారిని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి వారి బంధువులకు అప్పగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈరోజు నుంచి 6వ తేదీ వరకూ పెన్షన్ల పంపిణీ అందచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పెన్షన్ల పంపిణీపై ప్రభుత్వానికి ఎలక్షన్ కమీషన్ జారీ చేసిన ఆదేశాలు మేరకు మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈరోజు నుంచి కేటగిరీల వారిగా పెన్షన్ పంపిణీ చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నిర్ణయించింది. ఈ మేరకు వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వెళ్లి పెన్షన్ అందచేయనున్నారు. మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజకీయ కార్యకలాపాల్లో 18 ఏళ్లలోపు బాల, బాలికలను వినియోగించకూడదని విజయనగర జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పార్టీల ప్రచారం, పాంప్లెట్లు, జెండాల పంపిణీ, ర్యాలీలు, నినాదాలు ఇవ్వడంతో పాటు, రాజకీయ పార్టీలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం  పిల్లలను వినియోగించకూడదని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిబంధనల ప్రకారం ఇతరులను, విభిన్న ప్రతిభావంతులను కించపరిచే  పదాలను ప్రచారంలో వాడకూడదని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరుగుతాయని, అక్కడక్కడా 4 నుండి 5 వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా రానున్న మూడు రోజులలో నెల్లూరు, ప్రకాశం, పల్నాడు,  ఎన్టీఆర్, కాకినాడ, అనంతపురం, సత్యసాయి, కర్నూల్, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి జిల్లాలో సాధారణం కంటే అధికంగా రెండు నుంచి మూడు డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఉష్ణోగ్రతల పెరుగుదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈనెల 14వ తేదీ వరకూ అర్హులైన వారు  ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరి నారాయణన్ తెలిపారు. నెల్లూరులో ఆయన ఈ రోజు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 20 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. పోలింగ్ రోజున ఓటరు జాబితాలో చిన్న చిన్న తప్పులున్నా, ఫోటోలు సరిగా లేకపోయినా కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన పది గుర్తింపు కార్డులో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

2024 జాతీయ ప్రసార విధానాన్ని రూపొందించేందుకు సలహాలు సూచనలు కోరుతూ భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ -ట్రాయ్ ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. ప్రసార రంగంలో వివిధ అంశాలకు సంబంధించిన సమస్యలు పైరసీని ఎదుర్కొనడం, కంటెంట్ భద్రత ఉండేలా చూడడం మొదలైన అంశాల గురించి ఈ పత్రంలో పేర్కొన్నారు. 2024 జాతీయ ప్రసార విధాన రూపకల్పనకు సలహాలు, సూచనలు అనే ఈ పత్రాన్ని ఏప్రిల్ 30వ తేదీ నాటికల్లా భాగస్వాముల నుంచి స్పందన కోరే లక్ష్యంతో రూపొందించామని ఈ పత్రాన్ని ట్రాయ్ వెబ్సైట్ లో అందుబాటులోకి తెచ్చామని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిరంతర సమన్వయంతో ఉన్నతాధికారులు సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక సాధారణ  ఎన్నికల పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా అన్నారు. ఈరోజు విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ లో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంని ఆయన పరిశీలించారు. కంట్రోల్ రూమ్ లోని సీ-విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సాంకేతిక విభాగం, బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాల తదితర విభాగాల కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటాలు రామ్ మోహన్ మిశ్రాకు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అనపర్తి నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వెయ్యాలనీ అనపర్తి నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎమ్. మాధురీ విజ్ఞప్తి చేశారు. ఈరోజు తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగించడంపై  అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ ఐదేళ్లకు ఒకసారి మనల్ని పరిపాలించే పాలకులను ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని తెలిపారు.

================================

================================